క్లుప్తంగా

సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి



రాయదుర్గంలో ర్యాలీ చేస్తున్న మున్సిపల్ కార్మికులు, సీఐటీయూ నాయకులు

రాయదుర్గంటౌన్: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించి, పరిష్కారం చూపాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కార్మికులతో కలిసి పట్టణంలో నిరసన ర్యాలీ చేశారు. స్థానిక వినాయక సర్కిల్ నుంచి పాత బస్టాండ్ మీదుగా లక్ష్మీబజార్ వరకు ర్యాలీ చేసి, అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగరాజు, రాము, తిప్పేరుద్ర, నరసింహులు, తిప్పేస్వామి, ఆదిలక్ష్మీ, వన్నూరమ్మ, సిద్దలింగ తదితరులు పాల్గొన్నారు.

హంచనహాళ్‌లో వైద్య సేవలు



హంచనహాళ్‌లో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ జయకుమార్

విడపనకల్లు: మండలంలోని హంచనహాల్‌లో డాక్టర్ జయకుమార్ ఆధ్వర్యంలో రోగులకు గురువారం వైద్య పరీక్షలు చేశారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించారు. జ్వరాల బారిన పడకుండా ఆరోగ్యజాగ్రత్తలు పాటించాలన్నారు. నివాసాల ఎదుట శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలన్నారు. అనంతరం రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు బోయ కేశన్న, ఎంపీటీసీ భీంరావు, తదితరులు పాల్గొన్నారు.

సర్మాస్ హుసేనీ దర్గాలో ఫాతెహాలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారి సమాధి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో గురువారం ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. గురువారం స్వామివారం కావడంతో భక్తులు స్వామి దర్శనార్థం ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు స్వామి దర్శనానికి బారులుతీరారు. దర్గా పెద్దలు ఉదయం స్వామివారి సమాధికి గంధం పూసి నూతన వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు చేశారు.

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



సుధాకర్ (ఫైల్)

ఉరవకొండ రూరల్: మండలంలోని మోపిడి గ్రామ వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ తలారి సుంకమ్మ, భర్త పార్టీ నాయకులు తలారి సుధాకర్ (49) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, సర్పంచ్ నాగరాజు, ఉరవకొండ వైఎస్ ఎంపీపీ ఈడిగ ప్రసాద్, సర్పంచ్ శ్రీరాములు తదితరులు మోపిడికి చేరుకొని సుధాకర్ మృతదేహం వద్ద నివాళులర్పించారు.

22న చలో విజయవాడ



ఛలో విజయవాడ పోస్లర్లను విడుదల చేస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

విడపనకల్లు: ఈనెల 22న కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 22న చలో విజయవాడ నిర్వహిస్తున్నట్లు కౌలు రైతు సంఘం జిల్లా రైతు సంఘం నాయకులు బోయ వెంకటేశులు, సీపీఎం, ప్రాంతీయ కార్యదర్శి, అధ్యక్షుడు రంగారెడ్డి తెలిపారు.గురువారం మండలంలోని వేల్పు మడుగు, విడపనకల్లు గ్రామాల్లో కౌలు రైతులతో కలసి ఛలో విజయవాడ కరపత్రాలు విడుదల చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం నూతన కౌలు చట్టం తెస్తామని సీఎం చంద్ర బాబు ఎన్నికల ముందు కౌలు రైతులకు వాగ్దానం చేశారని గుర్తు చేశారు. కౌలు రైతుల సమస్యల సాధనకోసం చేపట్టిన ఛలో విజయవాడ కార్యక్రమానికి మండలం లోని కౌలు రైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు దుర్గప్ప,విజయ రామాంజినేయులు, సుంకన్న,రామాంజిని, సూరి,ఆంజనేయులు,నారాయణస్వామితదితర కౌలు రైతులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం ఎప్పుడో..?

- విత్తనాల పంపిణీలో ప్రభుత్వం నిర్లక్ష్యం
- ప్రతిపాదనలు పంపినా నేటికీ స్పష్టత లేదు
- ఖరారు కాని విత్తన సబ్సిడీ ధరలు



చిన్నముష్టూరు సమీపంలో వర్షాలు రావడంతో పొలాన్ని దుక్కి చేస్తున్న రైతు



ఆమిద్యాల వద్ద పొలాన్ని సిద్ధం చేసుకొని విత్తనాలు అందలేదని నిరాశతో ఉన్న రైతు

ఉరవకొండ: కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చినప్పటి నుంచి వ్యవసాయ రంగంపై నిర్లక్ష్యం చూపుతోంది. ఈఏడాది ఖరీఫ్‌లో వర్షాభావంతో ఆశించిన స్థాయిలో వేరుశనగ, ఇతర పంటలు సాగు చేయలేదు. ప్రత్యామ్నాయ పంటలైనా సాగు చేద్దామంటే విత్తనాలు పంపిణీ చేయలేదు. విత్తనాల కోసం జిల్లా వ్యవసాయ యంత్రాంగం రాష్ట్ర కమిషనరేట్‌కు ప్రతిపాదనలు పంపింది. నేటికీ పంపిణీపై స్పష్టతలేకపోవడంతో రైతులు అయోమయంలో ఉన్నారు.

ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల పరిధిలో 2,90,473 హెక్టార్లు సాధారణ సాగు విస్తీర్ణం కాగా, ఇందులో 2,44,517 హెక్టార్లు సాగు చేసే అవకాశం ఉందని అంచనా. అయితే 20 శాతం కూడా వేరుశనగ పంట సాగు చేయలేదు. మూడు నియోజకవర్గాల పరిధిలోని 15 మండలాల్లో 50 వేల క్వింటాళ్ల విత్తనం అవసరం కాగా, ప్రభుత్వం అరకొర విత్తనం సరఫరా చేసింది. ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో 17,420 హెక్టార్లలో 2,100 క్వింటాళ్ల కోసం వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు ప్రతిపాదనలు పంపారు. ఇందులో ఆముదం, రాగి, కంది, సజ్జ, ఉలవలు, పెసలు, అలసంద, కొర్ర, జొన్నలు లాంటి ప్రత్యామ్నాయ విత్తనాలు అవసరం ఉంది.

వైఎస్సార్‌సీపీ హయాంలో 80 శాతం సబ్సిడీ..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆగస్టు రెండో వారంలోనే ప్రత్యామ్నాయ పంటల విత్తనాల సబ్సిడీ ధరలు ఖరారు చేశారు. మూడో వారం నుంచే 80 శాతం సబ్సిడీతో విత్తనాలు పంపిణీ చేసి, రైతులను సకాలంలో ఆదుకున్నారు. ఈఏడాది సెప్టెంబర్ మూడోవారమవుతున్నా.. రైతులకు ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేయలేదు. వాతావరణ పరిస్థితులు అనుకూలించి, వర్షాలు పడుతుండడంతో రైతులు ప్రత్యామ్నాయ విత్తనాలు విత్తుకోవడానికి ఎంతో అనుకూలంగా ఉంది. ప్రభుత్వం ఈనెలాఖరులోపు ప్రత్యామ్నాయ విత్తనాలు ఇవ్వకపోతే బహిరంగ మార్కెట్లో విత్తనాలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. చిన్న, సన్నకారు రైతులు మాత్రం ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాలపైనే ఆధారపడ్డారు.

విత్తనాలు ఎప్పుడిస్తారో..?



ప్రత్యామ్నాయ విత్తనాలు సబ్సిడీతో ఎప్పుడిస్తారో? ఏమో అర్థం కావడం లేదు. రెండెకరాల్లో ఉలవ సాగు చేసుందుకు పొలాన్ని సిద్ధం చేసుకున్నా. ఈనెల రెండో వారంలో వానలు బాగా పడ్డాయి. ప్రస్తుతం పదునైన వర్షం పడింది. సబ్సిడీ ప్రత్యామ్నాయ విత్తనాలు అందిస్తారని ఆశగా ఎదురుచూస్తున్నా.

– బాబు, రైతు, ముష్టూరు, ఉరవకొండ మండలం

పెసర వేయాలనుకుంటున్నా



నాకున్న ఐదు ఎకరాల పొలంలో పెసర పంట సాగుచేయాలనుకున్నా. ఈనెల రెండో వారంలో భారీ వర్షం పడింది. పదును అయ్యింది. పెసర పంట సాగుచేసుందుకు సేద్యం పనులు చేసుకున్నా. ప్రభుత్వం సబ్సిడీతో విత్తనాలు పంపిణీ చేస్తుందని ఎదురుచూస్తున్నాం.

– వెంకటరెడ్డి, రైతు, వజ్రకరూరు

ప్రతిపాదనం పంపాం



ఉరవకొండ వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలో రైతుల అవసరానికి తగట్టు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేయడానికి ఇంకా ఎలాంటి అనుమతులు రాలేదు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందు వల్ల రైతుల నుంచి డిమాండ్ చాల ఉంది.

– సత్యనారాయణ, ఏడీఏ, ఉరవకొండ

పేదవాడికి వైద్యవిద్య దూరం చేసే కుట్ర

- పోస్టర్లు విడుదల చేసిన వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేత నవీన్‌రెడ్డి



పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్ విద్యార్థి విభాగం, యువజన విభాగం రాష్ట్ర నాయకులు

ఉరవకొండ: మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసి పేదవాడికి వైద్య విద్య దూరం చేసేందుకు సీఎం చంద్రబాబు కుట్ర పన్నుతున్నాడని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాయలంలో పార్టీ యువజన, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 19న తలపెట్టిన చలో పెనుకొండ మెడికల్ కళాశాల కార్యక్రమ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి 17 మెడికల్ కళాశాలలను తీసుకొస్తే వాటిని ప్రైవేటీకరించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. మొత్తం 17 మెడికల్ కళాశాలల్లో 5 కళాశాలలను పూర్తి చేసి తరగతులు ప్రారంభించడంతో 750 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకొచ్చాయన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎక్కడ పేరొస్తుందోనని చంద్రబాబు వాటిని ప్రైవేట్ పరం చేస్తున్నారని మండిపడ్డారు.

మెడికల్ కౌన్సిల్‌కు లేఖ రాయడం సిగ్గుచేటు:

రాష్ట్రంలోని 17 ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్వహణ కష్టమవుతుందని, వైద్య సీట్లు వద్దంటూ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు లేఖ రాయడం సిగ్గుచేటని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్‌రెడ్డి, పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆమిద్యాల రాజేష్ అన్నారు. ఏటా 20 లక్షల ఉద్యోగాలు అని చెప్పి రెండేళ్లవుతున్నా ఒక్క ఉద్యోగం కూడా కూటమి ప్రభుత్వం కల్పించలేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షులు సాకే పురుషోత్తం, విద్యార్థి సంఘం నాయకులు కాషిఫ్, వెలిగొండ దేవా, అనిల్, వినోద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చలో మెడికల్ కాలేజ్

కళ్యాణదుర్గం: మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఈనెల 19న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పెనుకొండలో నిర్వహించిన చలో మెడికల్ కాలేజ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బొమ్మయ్య గురువారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంతో పాటు అనంతపురం జిల్లాలోని ప్రతి విద్యార్థి, యువజన విభాగం నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, పార్టీ శ్రేణులు తరలిరావాలన్నారు.

యువత తరలిరండి..

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 19న సత్యసాయి జిల్లా పెనుకొండలో జరిగే చలో మెడికల్ కాలేజ్ కార్యక్రమానికి యువత పెద్ద ఎత్తున తరలిరావాలని యూత్ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు తలారి చరణ్ స్థానిక నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్నట్లు తెలిపారు. పెనుకొండలో వైఎస్సార్‌సీపీ హయాంలో నిర్మించిన మెడికల్ కళాశాల భవనాల పరిశీలనకు పెద్ద ఎత్తున యువతతరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు కార్యక్రమం జరుగుతుందన్నారు. రాష్ట్ర యూత్ కార్యదర్శి రామాంజనేయులు యాదవ్, పార్టీ అధికార ప్రతినిధి గోపారం శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాప్, బ్రహ్మసముద్రం మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు మల్లికార్జున, పాతలింగ, శంకర్ నాయక్, సన్నాజి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్ యూత్ విభాగం నాయకులు

జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక





జిల్లాపోటీలకు ఎంపికైన గోకుల్ కుమార్‌రెడ్డి, బాలాజీ

రాయదుర్గంటౌన్: అండర్ 14, అండర్ 17 విభాగాల్లో జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో రాయదుర్గానికి చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థి గోకుల్‌కుమార్‌రెడ్డి అండర్ 17 విభాగంలో జిల్లా స్థాయికి ఎంపిక కాగా, అండర్ 14 విభాగంలో 8వ తరగతి విద్యార్థి బాలాజీ ఎంపికయ్యాడు. ఇటీవల ఎస్‌జీఎఫ్‌ఐ జిల్లా స్థాయి సెలక్షన్స్ ఆర్‌డీటీ స్టేడియంలో జరిగినట్లు పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఆసిఫ్ తెలిపారు.

ఆర్డీటీ కోసం అసెంబ్లీలో గళం విప్పాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఎస్సీ,ఎస్టీ సంఘాల నాయకులు

కళ్యాణదుర్గం: అనంతపురం ఉమ్మడి జిల్లాలో ఆర్డీటీ సేవలు కొనసాగించేందుకు, ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ కోసం మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు అసెంబ్లీలో గళం విప్పాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కళ్యాణదుర్గంలోని స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ కోసం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సంఘాల నేతలు సాకే హరి, అక్కులప్ప, చెలిమప్ప, కుళ్లాయప్ప మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో గత 56 ఏళ్లుగా ఆర్డీటీ నిరుపేదలకు సేవలు అందిస్తోందన్నారు. ఆర్డీటీకి విదేశీ నిధులు రాకపోవడం, ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ కాకపోవడంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడ్డాయన్నారు. పేదల అభివృద్ధికి ఆటంకం ఏర్పడిందన్నారు. పేదలు ఆర్డీటీ కోసం పెద్ద ఎత్తున శాంతియుత కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో చలనం రాలేదని మండిపడ్డారు. సమష్టిగా పోరాడితే ఆర్డీటీని కాపాడుకుంటామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ సంఘాల నాయకులు కురాకులపల్లి గోపాల్, మధు, నారాయణ, మారుతి, శంకర్ పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కమిటీ ఏర్పాటు



విడపనకల్లు నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్న సభ్యులు

విడపనకల్లు: ఏపీటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా ఉపాధ్యక్షుడు సాకే భాస్కర్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యవర్గ సమావేశానికి పర్యవేక్షకుడిగా సిరాజుద్దీన్ హాజరై ఏపీటీఎఫ్ నూతన కమిటీని ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడిగా నేసే నరసింహ, ప్రధాన కార్యదర్శిగా బళ్లారి నజీర్ అహ్మద్‌ను ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సర్దార్ వలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన



దొడగట్టలో చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



రీ కాలింగ్ చంద్రబాబుస్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

డి.హీరేహాళ్(బొమ్మనహాళ్): కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. గురువారం సాయంత్రంరాయదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ఆదేశాల మేరకు డి.హీరేహాళ్ మండలంలోని దోడగట్ట, ఎస్ఆర్ కోట గ్రామాల్లో బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తు చేస్తూ సూపర్ సిక్స్ పథకాలు కుటుంబంలో ఎంతమందికి అందుతున్నాయనే విషయాలను తెలుసుకున్నారు. నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెడుతూ వస్తోందన్నారు. కూటమి అధికారంలోకొచ్చిన తర్వాత సంక్షేమం, అభివృద్ధి అటకెక్కిందన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి నేతలను ప్రజలు నీలదీయాలన్నారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ రాష్ట్రంలో 17 కాలేజీలు మంజూరు చేశారని, వైద్యవిద్యను ప్రైవేటీకరణకు నిర్ణయం తీసుకోవడం సరికాదని అన్నారు. కూటమి పాలనను పక్కబెట్టి, వైఎస్సార్‌సీపీ నాయకులపై కక్షసాధింపు ధోరణి అవలంబిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు తొండా వెంకటేశులు, తాలుకా బూత్ కమిటీ అధ్యక్షుడు అంజినరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు కురుబ హనుమంతరెడ్డి, సర్పంచ్ ఆంజనేయ, మండల కమిటీ అధ్యక్షుడు చిత్రయ్య, సింగాడి మంజు, జయరామ్‌రెడ్డి, కాదలూరు గంగిరెడ్డి, నాయకులు చిన్న అంజినేయ, ప్రకాష్‌రెడ్డి, శివారెడ్డి, తిప్పేస్వామి, చిక్కణ్ణ, రఘు, దేవిరెడ్డి, ఈశ్వరరెడ్డి, గోడిసెలపల్లి తిప్పేస్వామి, మురిడి బాబు, శ్రీరాములు, చెర్లోపల్లి రవి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకూ అన్యాయం


బ్రహ్మసముద్రం : కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అన్ని వర్గాలకూ అన్యాయం జరుగుతోందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో బాబు షూరిటీ..మోసం గ్యారెంటీ.. రీ కాలింగ్ చంద్రబాబుస్ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మోస పూరిత పాలన సాగిస్తోందన్నారు. చంద్రబాబు మాటలు, హామీలను ప్రజలు నమ్మి నిలువునా మోస పోయామని గుర్తు చేసుకుంటున్నారన్నారు. రానున్న రోజుల్లో కూటమి నేతలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ రాజ్ విభాగం కార్యదర్శి గోపాల్‌రెడ్డి, జిన్నామల్లి, మండల యూత్ కన్వీనర్ ఏసేపు, తాలుకా అంగన్‌వాడి విభాగం అధ్యక్షురాలు సునీత, మండల విద్యార్థి విభాగం నాయకుడు గోపీ, నీలాంజనేయులు, శంకర్‌రెడ్డి, జయన్న, బసవరాజు, బాలయ్య, శివలింగ, మల్లికార్జున, తిప్పేస్వామి, పెన్నప్ప, ఆనంద్, ప్రశాంత్, వీరదాస్, శ్యాంబాబు, మారుతి, నింగప్ప పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

డిమాండ్లు పరిష్కరించండి

గుమ్మఘట్ట: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ వీఆర్ఏలు ధర్నా చేశారు. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం ఎదుట వీఆర్ఏలు బైఠాయించి, నిరసన తెలిపారు. జీతాలు పెంచాలని,నామినీగా పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీటీ విజయలక్ష్మికం అందించారు. కార్యక్రమంలో వీఆర్ఏలు వీరభద్ర, నగేష్, లోకేష్, అశోక్, వన్నూరుస్వామి, రమేష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల ధర్నా



కణేకల్లులో ధర్నా చేస్తున్న వీఆర్ఏలు

కణేకల్లు: తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీఆర్ఏలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేశారు. వీఆర్ఏలు విధులను బహిష్కరించి ధర్నా చేశారు. వీఆర్ఏలకు ప్రమోషన్లు కల్పించాలని, పేస్కేల్ అమలు చేసి రూ.26 వేలు జీతనం ఇవ్వాలని, నామినీ వీఆర్ఏలను గుర్తించి వారి రెగ్యులర్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు.

ఘనంగా సామూహిక సీమంతాలు

ఉరవకొండ: మండల వ్యాప్తంగా పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఉరవకొండ ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి ఆధ్వర్యంలో రేణుమాకుపల్లి అంగన్‌వాడీ–2 కేంద్రంలో సూపర్‌వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు.

వ్యవసాయాధికారిని నియమించండి

కుందుర్పి: కుందుర్పి మండలానికి వ్యవసాయాధికారిని నియమించాలని ఎంపీపీ నాగరాజు కోరుతున్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలానికి శాశ్వత వ్యవసాయాధికారి లేరని, కంబదూరు ఏఈఓ విజయకుమార్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించారన్నారు. ఆయన రైతులకు అందుబాటులో ఉండడంలేదన్నారు. సలహాలు, సూచనలు, రైతు సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో దిక్కుతెలియక రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కళ్యాణదుర్గం ఏడీఏ యల్లప్ప కేవలం కుందుర్పిలో ఉన్న 19 మందుల దుకాణాల యజమానులతో నెలసరి మామూళ్ల తీసుకునేందుకు తప్పా రైతుల సమస్యలను ఏనాడు పరిష్కరించిన పాపాన లేదన్నారు. రైతు సమస్యలపై ఏడీఏకు ఫోన్ చేస్తే ప్రభుత్వం మారింది తాను కొన్ని విషయాల్లో ఏమీ చేయలేనని సమాధానం చెబుతున్నట్లు ఎంపీపీ తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

కళ్యాణదుర్గం రూరల్: కంబదూరు పోలీసులు పేకాట స్థావరంపై గురువారం దాడి చేశారు. కంబదూరు మండలంలోని గొల్లపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారంతో దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఎనిమిది మంది జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు. జూదగాళ్ల నుంచి 8 ద్విచక్ర వాహనాలు, రూ.15,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. పేకాట రాయుళ్లను కోర్టుకు తరలించామని ఎస్ఐ లోకేష్ తెలిపారు.

స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యాధికారి కార్తీక్‌రెడ్డి

బొమ్మనహాళ్: స్థానిక పీహెచ్‌సీలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఎంపీపీ వైద్యాధికారులతో కలసి గురువారం ప్రారంభించారు. ఎంపీపీ పెద్దన్న,పీహెచ్‌సీ వైద్యాధికారి కార్తీక్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్య శిబిరంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రి నుంచి ఈఎన్‌టీ ప్రత్యేక వైద్య నిపుణులు డింపుల్, వైద్యాధికారిణి ప్రియాంకతో కలసి వైద్య సేవలు చేశారు. మహిళలకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మెరుగైన చికిత్సలకు జిల్లా కేంద్రానికి రెఫర్ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, సీహెచ్‌ఓ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సంతకాల కోసం పడిగాపులు



తహసీల్దార్ కార్యాలయం వద్ద వితంతువుల పడిగాపులు

కూడేరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో సంతకాల కోసం జనం పడిగాపులు కాయాల్సి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ సాంఘిక కార్యక్రమం, కుటుంబ ప్రయోజనం (ఎఫ్‌బీ) పథకం ద్వారా లబ్ధి పొందేందుకు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించింది. 2017 తర్వాత భర్త మరణించిన మహిళలు ఎవరైనా ఉంటే ఈ పథకానికి అర్హులు. గురువారం ఉదిరిపికొండ, కొర్రకోడు, కలగళ్ల, కూడేరు, ఇప్పేరు, కమ్మూరు, మరికొన్ని గ్రామాల వితంతువులు దరఖాస్తు చేసుకోవడానికి తహసీల్దార్ కార్యాలయానికి తరలివచ్చారు. కానీ వీఆర్వోలు అందుబాటులో లేక పోవడంతో నిరాశగా వెనుదిరిగారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సురక్ష వెహికల్ ద్వారా విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రాయదుర్గంటౌన్: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలల్లో సురక్ష వెహికల్ ద్వారా సైబర్ నేరాలు, వాటి అనర్థాలపై పోలీసులు అవగాహన కల్పించారు. సురక్ష ఎల్‌ఈడీ డిస్ప్లే, ప్రొజెక్టర్ ద్వారా వీడియోలు ప్రదర్శిస్తూ విద్యార్థులను అప్రమత్తం చేశారు. సీఐ జయనాయక్ మాట్లాడుతూ సైబర్ నేరాల నియంత్రణ, డ్రగ్స్ వాడకం వల్ల అనర్థాలు, ఫేక్ జాబ్స్, గుడ్ అండ్ బ్యాడ్ టచ్, బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శక్తిటీమ్ ఏఎస్ఐ విజయ్, హెడ్‌కానిస్టేబుల్ నజీర్‌ఖాన్, కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

సమన్వయంతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ మారుతమ్మ

కళ్యాణదుర్గం: గ్రామ పంచాయతీల్లో సర్పంచులు, ఎంపీటీసీల సమన్వయంతో కలిసి అభివృద్ధి చేసుకుందామని ఎంపీపీ మారుతమ్మ తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ సర్పంచులకు డివిజన్ స్థాయిలో స్థానిక సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజుల శిక్షణ ఇచ్చారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్క సర్పంచు ఆయా పంచాయతీల అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వాల నుంచి వచ్చే పలు అభివృద్ధి కార్యక్రమాలను గ్రామాల్లో చేపట్టాలన్నారు. అనంతరం డీఎల్‌డీఓ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో నిర్దేశించిన లక్ష్యాలను చేరువ కావాలన్నారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలపై ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివశంకర్ వివరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆలిండియా సైనిక్ క్యాంపునకు ఎన్‌సీసీ క్యాడెట్



ఎన్‌సీసీ క్యాడెట్ ఆసియాబానును అభినందిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: ఆలిండియా తల సైనిక్ క్యాంపునకు కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ ఆసియాబాను ఎంపికైంది. ఈమె డిగ్రీ కళాశాలలో బీఎస్సీ భౌతికశాస్త్రం ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆసియాబాను ఆలిండియా సైనిక్ క్యాంపునకు ఎంపికై ఢిల్లీలో శిక్షణ పూర్తి చేసుంది. తల సైనిక్ క్యాంపునకు ఎంపికైన ఆసియాబాను ఢిల్లీకి వెళ్లడానికి ముందు 10 నుంచి 11 క్యాంపుల్లో అంచెలంచెలుగా శిక్షణలో ప్రావీణ్యం సాధించి, ఢిల్లీ స్థాయికి ఎంపికయినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, ఎన్‌సీసీ సీటీవో బాల నరసింహులు తెలిపారు. ఢిల్లీస్థాయిలో ఎంపికైన ప్రతిభ చూపిన ఆసియాబాను ప్రోత్సహిస్తూ గురువారం అభినందన సభ నిర్వహించారు.